ట్యాంక్‌ఫుల్‌




భారీ వర్షాలతో హుస్సేన్‌సాగర్‌లో పెరిగిన నీటి మట్టం

- వరదనీటిని తూముల ద్వారా బయటకు పంపిస్తున్న అధికారులు
- వర్షంలో సైతం ట్యాంక్‌బండ్‌పై కొనసాగిన రాకపోకలు



నీటి మట్టం



హుస్సేన్‌సాగర్‌ తూముల నుంచి బయటకు వెళ్తున్న వరద నీరు



ఆహ్లాదకరంగా హుస్సేన్‌సాగర్‌ రోడ్డు..

కవాడిగూడ: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నగరంలోని ట్యాంక్‌బండ్‌ నిండుకుండలా మారింది. హుస్సేన్‌సాగర్‌లో నీటి మట్టం పెరగడంతో 17 తూముల నుంచి వరద నీటిని దిగువ ప్రాంతానికి వదులుతున్నారు. ఈ నీరు హోటల్‌ వైస్రాయ్‌ మీదుగా ఎరుకల బస్తీ లోయర్‌ ట్యాంక్‌బండ్‌, గోషాల, డీబీఆర్‌ మిల్‌, మారుతీనగర్‌, సుభాష్‌చంద్రబోస్‌ నగర్‌, గాంధీనగర్‌ లింక్‌బ్రిడ్జి, సబర్మతినగర్‌, అరుంధతినగర్‌, ధోబీగల్లీ, అశోక్‌నగర్‌, అరవింద్‌నగర్‌ కాలనీ, సూరజ్‌నగర్‌ మీదుగా బాగ్‌లింగంపల్లి, నల్లకుంట, గోల్నాక వద్ద ముసారాంబాగ్‌ వద్ద మూసీలో కలుస్తోంది. నిత్యం కేవలం రెండు తూముల నుంచి నీటిని దిగువ ప్రాంతానికి వదిలేవారమని అధికారులు పేర్కొన్నారు. వర్షాలకు ట్యాంక్‌బండ్‌ పరిసరాలు ఆహ్లాదకరంగా కనిపించాయి. నల్లని మబ్బులు సాగర్‌ను కమ్మేయడంతో ఆ దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. అటుగా వెళ్లే వారు ఆ దృశ్యాలను తమ ఫోన్లలో బంధించుకున్నారు. ఇదిలా ఉండగా వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వాహనదారులు ట్యాంక్‌బండ్‌పై రాకపోకలు సాగించారు.

గణేష్‌ ఉత్సవాలతో హిందూ ఐక్యతను చాటాలి

మండప నిర్వాహకుల సమావేశంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్‌ కె.లక్ష్మణ్‌

- నిర్వాహకులు ఉత్సవ సమితి సహాయ, సహకారాలు తీసుకోండి
- కులాలు వేరైనా హిందువులంతా ఒక్కరేనని చాటి చెప్పాలి
- ఉత్సవాల్లో యువత పాశ్చాత్య పోకడలకు తావివ్వొద్దు



ముషీరాబాద్‌: కులాలు వేరైనా హిందువులంతా సంఘటితంగా గణేష్‌ ఉత్సవాలను జరుపుకోవాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్‌ కె.లక్ష్మణ్‌ అన్నారు. ఆదివారం ముషీరాద్‌లోని హెరిటేజ్‌ హాల్‌లో భాగ్యనగర్‌ గణేష్‌ ఉత్సవ సమితి (బీజీయూఎస్‌) ముషీరాబాద్‌ నియోజకవర్గం ఆధ్వర్యంలో గణేష్‌ మండపాల నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. సభకు నియోజకవర్గం ఉత్సవ సమితి కన్వీనర్‌ ఎ.వినయ్‌కుమార్‌ అధ్యక్షత వహించగా డాక్టర్‌ కె.లక్ష్మణ్‌ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పాశ్చాత్య పోకడలకు తావివ్వకుండా ఈ ఉత్సవాలను భజనలు, ఆధ్యాత్మిక భావనతో నిర్వహించాలన్నారు. దివంగత బీజేపీ నేత ఆలే నరేందర్‌ భాగ్యనగర్‌ గణేష్‌ ఉత్సవ సమితిని స్థాపించి గణేష్‌ ఉత్సవాలు, నిమజ్జన ఊరేగింపులను నిర్వహించేలా కృషి చేశారని గుర్తు చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి భాగ్యనగరానికి పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారన్నారు.

హిందువులంతా ఏకమైనప్పుడే..

హిందువులంతా ఏకమైనప్పుడే ఉత్సవాలకు సరైన అర్థం ఉంటుందని.. అప్పుడే వేడుకలను వైభవంగా జరుపుకోవచ్చని పేర్కొన్నారు. హిందూ యువత మండపాల వద్ద ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఎలాంటి గొడవలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత యువతపైనే ఉందన్నారు. నిర్వాహకులు ఉత్సవ సమితి సహాయ, సహకారాలు తీసుకోవాలని సూచించారు. బంగ్లాదేశ్‌లో దేశంలో హిందువులు లేకుండా చేయడామే లక్ష్యంగా ఒక వర్గం పని చేస్తోందని విమర్శించారు. అందుకే మన పండగలతో హిందువుల ఐక్యతను చాటిచెప్పాలన్నారు.

హిందువులంతా కలసి రావాలి...

బీజీయూఎస్‌ ముషీరాబాద్‌ నియోజకవర్గ కన్వీనర్‌ వినయ్‌కుమార్‌ మాట్లాడుతూ... నియోజకవర్గంలో గణేష్‌ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు హిందువులంతా కలసిరావాలన్నారు. ఇబ్బందులు తలెత్తితే మండప నిర్వాహకులు వెంటనే బీజీయూఎస్‌ సభ్యులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఉత్సవాలు సజావుగా.. వైభవంగా కొనసాగడానికి ఉత్సవ సమితి ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఈ సమావేశంలో సమితి కార్యదర్శి ఆర్‌.శశిధర్‌, సభ్యులు ఆలే భాస్కర్‌రాజు, సెంట్రల్‌ కమిటీ సభ్యులు నాయిని బుచ్చిరెడ్డి, నాయకులు మద్దూరి శివాజీ, మహేందర్‌బాబు, శక్తిసింగ్‌, ఆయూష్‌రాజ్‌, పృథ్వీరాజ్‌, రాజేష్‌, రమేష్‌రాం, జమాల్‌పురి నందు, రాంరెడ్డి, భద్రినారాయణ పాల్గొన్నారు.

బీజీయూఎస్‌ ముషీరాబాద్‌ డివిజన్‌ కన్వీనర్‌గా రాజేష్‌చారి



రాజేష్‌చారికి నియామక పత్రం అందజేస్తున్న నియోజకవర్గ కన్వీనర్‌ వినయ్‌కుమార్‌

ముషీరాబాద్‌: భాగ్యనగర్‌ గణేష్‌ ఉత్సవ సమితి ముషీరాబాద్‌ డివిజన్‌ కన్వీనర్‌గా బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు రాజేష్‌చారి, కోకన్వీనర్‌గా వసంత్‌, సుమిత్‌, రవిశంకర్‌ నియమితులయ్యారు. ఆదివారం నియోజకవర్గ కన్వీనర్‌ వినయ్‌కుమార్‌ వారికి నియామకపత్రాలు అందజేశారు. రాజేష్‌చారి మాట్లాడుతూ... ముషీరాబాద్‌లో గణేష్‌ ఉత్సవాలు వైభవంగా నిర్వహించి ప్రజల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

ముషీరాబాద్‌: బీసీ కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు, తెలంగాణ రాష్ట్ర యాదవ్‌ సంఘం నేత గంగుల మధుయాదవ్‌ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం బీసీ డిమాండ్ల సాధన కోసం గాంధీ ఆసుపత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సిద్ధేశ్వర్‌ను మధుయాదవ్‌ పరామర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ కులగణన చేసి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. బీసీ డిక్లరేషన్‌ లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించొద్దని పేర్కొన్నారు. బీసీల హక్కుల కోసం ఐక్యంగా పోరాడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు మల్లేష్‌యాదవ్‌, రాజారాంయాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్‌ దాడులు ఆపాలి

కాచిగూడ: అమెరికా సామ్రాజ్యవాదం అండతో పాలస్తీనాపై ఇజ్రాయెల్‌ సాగిస్తున్న అమానుష దమనకాండకు వ్యతిరేకంగా ఆదివారం కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌ మాట్లాడుతూ... అమెరికా సామ్రాజ్యవాద కాంక్షకు పాలస్తీన్‌ బలవుతున్నారని అన్నారు. ప్రపంచంలో శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి శరవేగంగా పురోగమిస్తున్న యుగంలోనూ 'పాలస్తీనా'పై ఇజ్రాయెల్‌ దాడులను ప్రపంచంలో ప్రతి శాంతి కాముకులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజారావు, వెంకటేష్‌, రమ, ఎం.శ్రీనివాస్‌, అనురాధ, శివబాబు, విజయ్‌కుమార్‌, యాదగిరి, కిషన్‌, నాగేశ్వర్‌రావు, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

4న ఆత్మీయ పౌర సన్మానం

చిక్కడపల్లి: తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. కోదండరామ్‌ శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా ఈనెల 4న ఆత్మీయ పౌర సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పార్టీ గ్రేటర్‌ అధ్యక్షుడు ఎం.నర్సయ్య తెలిపారు. టీజేఎస్‌ ముషీరాబాద్‌ కన్వీనర్‌ శ్రీనివాస్‌యాదవ్‌ ఆధ్వర్యంలో ఆదివారం జవహర్‌నగర్‌ కమ్యూనిటీహాల్‌లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. త్యాగరాయ గానసభలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా లోయర్‌ ట్యాంక్‌బండ్‌లోని కట్టమైసమ్మ దేవాలయం నుంచి ఇందిరాపార్క్‌ మీదుగా భారీ ర్యాలీని నిర్వహిస్తామని తెలిపారు.

దేవాలయాలపై దాడులు చేస్తున్న వారికి బుద్ధి చెప్పాలి

వీహెచ్‌పీ చిక్కడపల్లి అధ్యక్షుడు సంజీవ్‌కుమార్‌ అగర్వాల్‌

కవాడిగూడ: హిందూవులంతా ఏకతాటిపైకి వచ్చి హిందువుల మనోభావాలు, హక్కులను కాపాడుకునేందుకు ముందుకు రావాలని విశ్వ హిందూ పరిషత్‌ విద్యానగర్‌ జిల్లా చిక్కడపల్లి అధ్యక్షుడు సంజీవ్‌కుమార్‌ అగర్వాల్‌ అన్నారు. రాబోయే గణేష్‌ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. హిందువుల దేవాలయాలపై దాడులు చేస్తున్న వారికి బుద్ధి చెప్పాలన్నారు. హిందువులంతా ఐకమత్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో రోజురోజుకు హిందువులపై పెరిగిపోతున్న దాడులు, హత్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. హిందువులపై జరిగే దాడులు, హత్యలను అరికట్టేందుకు హిందువులంతా ఏకతాటిపైకి రావాలన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్య ఘటనలు జరగకుండా హిందూ యువత తమ వంతు కృషి చేయాలన్నారు. వీహెచ్‌పీ విద్యానగర్‌ జిల్లా చిక్కడపల్లి ప్రఖండ 60వ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని హిందూ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం దోమలగూడ న్యూ ఎస్‌బీహెచ్‌కాలనీలో జరిగింది.



న్యూఎస్‌బీహెచ్‌కాలనీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సంజీవ్‌కుమార్‌ అగర్వాల్‌

విద్యార్థులకు స్కాలర్‌షిప్స్‌

కాచిగూడ: విద్యార్థులు ఇష్టపడి చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హెచ్‌సీయూ వైస్‌ చాన్సలర్‌ ప్రొ. జగదీశ్వర్‌ అన్నారు. భావసార్‌ క్షత్రియ గ్రాడ్యుయేట్స్‌ అసోసియేషన్‌ టీఎస్‌ ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడ, సుందర్‌నగర్‌లోని భావసార్‌ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు స్కాలర్‌షిప్స్‌ను బీజేపీ హైదరాబాద్‌ సెంట్రల్‌ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ ఎన్‌.గౌతంరావుతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు శ్రీధర్‌ లోఖండే, కృష్ణ శీర్‌సాగర్‌ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌ ముత్యం అందించిన సేవలు చిరస్మరణీయం



డాక్టర్‌ కె.ముత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్‌

కాచిగూడ: తెలుగు సాహిత్య పరిశోధకుడు డాక్టర్‌ కె.ముత్యం శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటంపై వ్రాసిన సిద్ధాంత గ్రంథం చరిత్రలో స్థిరస్థాయిగా నిలిచిపోతుందని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్‌ అన్నారు. దేవులపల్లి వెంకటేశ్వర్‌రావు అనాడు రాసిన తెలంగాణ సాయుధ పోరాట పుస్తకం ఏ విధంగా చరిత్రలో నిలిచిపోయిందో శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట గ్రంథం కూడా అంతే స్థాయిలో చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ఆదివారం నారాయణగూడలోని భారత్‌ విద్యాసంస్థల ఆడిటోరియంలో తెలుగు సాహిత్య పరిశోధకుడు డాక్టర్‌ కె.ముత్యం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు వక్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముత్యంపై రాసిన పరిశోధనా ముత్యం, మట్టి మనసుల కుంచే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ముత్యం బెనారస్‌ విశ్వవిద్యాలయంలో శ్రీకాకుళం ఉద్యమంపై పరిశోధన చేసి డాక్టరేట్‌ పొందారని తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయం అధ్యాపకుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారన్నారు. మరుగున పడిన చరిత్రను వెలుగులోకి తెచ్చి అనేక పుస్తకాలు ప్రచురించారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పి.శశిధర్‌ రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి, జూలూరు గౌరీ శంకర్‌, ప్రముఖ సాహితీవేత్త కాలేశ్వరం శంకర్‌, ప్రొఫెసర్‌ వినాయక్‌ రెడ్డి, తులా రాజేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా ఉపాధ్యక్షురాలిగా మట్ట జయంతి

కాచిగూడ: బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా ఉపాధ్యక్షురాలిగా మట్ట జయంతి గౌడ్‌ను నియమిస్తూ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్‌.కృష్ణయ్య ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ కన్వీనర్‌ గుజ్జ కృష్ణతో కలిసి ఆర్‌.కృష్ణయ్య మాట్లాడుతూ... సంపూర్ణ మద్యపాన నిషేధం విధించినప్పుడే మహిళా ప్రగతి జరుగుతుందన్నారు. మహిళలపై అత్యాచారాలు తగ్గుతాయని పేర్కొన్నారు. మొదటి దశలో బెల్టుషాపులు ఎత్తివేయాలని, జాతీయ రహదారులు, ప్రధాన రహదారుల్లో ఉన్న మద్యం దుకాణాలు రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. రాత్రి 7గంటల తర్వాత మద్యం దుకాణాలు మూసి వేయాలన్నారు. డ్రగ్స్‌ను పూర్తిగా మార్కెట్‌ నుంచి తొలగించాలని అన్నారు. బిహార్‌లో మద్యపాన నిషేధం విధించిన తర్వాత అత్యాచారాలు, హత్యలు తగ్గిపోయాయని అన్నారు. మహిళా సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మద్యపాన నిషేధం విధించాలని పెద్ద ఎత్తున ఉద్యమించాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు.

మున్నూరుకాపులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

కాచిగూడ: మున్నూరుకాపు సామాజిక వర్గానికి మంత్రివర్గంలో చోటు కల్పించాలని మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేనా రాష్ట్ర కన్వీనర్‌ ఉగ్గే శ్రీనివాస్‌ పటేల్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం కాచిగూడలోని మున్నూరుకాపు సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణలోనే అత్యధిక జనాభా కల్గిన మున్నూరుకాపులకు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వ నామినేటెడ్‌ పదవుల్లో, కాంగ్రెస్‌ పార్టీలో మున్నూరుకాపులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. లేకుంటే మున్నూరుకాపుల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. మున్నూరుకాపులకు ప్రత్యేక ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ ఏర్పాటు చేసి ప్రతి ఏడాది రూ.5వేల కోట్ల బడ్జెట్‌ కేటాయించాలని డిమాండ్‌ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేసి స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని అన్నారు. మున్నూరుకాపుల పేరు చివరన పటేల్‌ అనే గెజిట్‌ను విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. ఈనెల 8వ తేదీన స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులకు వినతి పత్రాలు అందజేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

చదువుకోమని మందలిస్తే.. వెళ్లిపోయిన విద్యార్థి

కాచిగూడ: చదువుకొమ్మని కుటుంబ సభ్యులు మందలిస్తే ఓ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్సై నరేష్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం... తిలక్‌నగర్‌ సంజీవయ్య నగర్‌ ప్రాంతానికి చెందిన రమేష్‌ కుమారుడు రక్షణ సంగమేశ్‌ (15) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శనివారం రాత్రి చదువుకోవాలని కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన సంగమేశ్‌ ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బాలుడి అన్న సాయికుమార్‌ కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెబ్రోను చర్చిలో ప్రార్థనలు ప్రశాంతం

- రాత్రి సైతం కొంత ఉద్రిక్తత పరిస్థితి
- సొసైటీ, ట్రస్టు అనే విభేధాలు లేకుండా ఆదివారం ప్రార్థనలు



మాట్లాడుతున్న క్రిస్టియన్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ దీపక్‌ జాన్‌, రాజేశ్వర్‌రావు

చిక్కడపల్లి: గోల్కొండ క్రాస్‌రోడ్డులోని హెబ్రోను చర్చిలో ఆదివారం ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. కొన్నేళ్లుగా ఇక్కడ సొసైటీ, ట్రస్టు మధ్య విబేధాలు నెలకొన్న విషయం విదితమే. కోర్టులోనూ పలు కేసులు సైతం కొనసాగుతున్నాయి. బ్రదర్‌ ఎఫ్‌సీఎస్‌ పీటర్‌, బ్రదర్‌ ఎఫ్‌సీఎస్‌ పీటర్‌, బ్రదర్‌ జాన్‌స్టీవర్ట్‌, బ్రదర్‌ ఏసు పాదం వాక్య పరిచర్య చేశారు. దైవసేవకులు వై.జాన్‌ సుబ్బారెడ్డి, జోసెఫ్‌ కురియన్‌ పర్యవేక్షణ చేశారు. ట్రస్టు, సొసైటీ వివాదాల నేపథ్యంలో ఫిర్యాదుల మేరకు రాష్ట్ర క్రిస్టియన్‌ ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ దీపక్‌జాన్‌, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు హాజరై పరిస్థితిని సమీక్షించి మాట్లాడారు. వివాదాలకు అతీతంగా అంతా కలసి ప్రశాంతంగా ప్రార్థనలు నిర్వహించారు. ఇక ముందు కూడా ఇలాగే కొనసాగించాలని ఆకాంక్షించారు.

◆ హెబ్రోను చర్చిలో సొసైటీ, ట్రస్టు మధ్యన కొనసాగుతున్న వివాదాల నేపథ్యంలో తాము ఇరువురితో మాట్లాడి సఖ్యతకు కృషి చేశామని తెలిపారు. దానికి ఇరువురు సుముఖం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. అంతా కలసి ఐక్యంగా చర్చి నిర్వహణ, ప్రార్థనలు జరుపుకోనున్నట్లు వివరించారు. ప్రార్థనల కోసం వచ్చే క్రైస్తవులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు జరిపిస్తామని వారు తెలిపారు.

అందరూ కలసి రావడం శుభ సూచకం..

మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ... చర్చి వ్యవస్థాపకులు దైవజనులు బ్రదర్‌ భక్తసింగ్‌ చూపిన మార్గంలో అంతా కలసికట్టుగా పని చేసేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా బ్రాంచీలు కలిగిన హెబ్రోను చర్చిలో భేదాభిప్రాయాలు లేకుండా నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. భవిష్యత్‌లోనూ ఎలాంటి విభేదాలకు తావు లేకుండా చర్చి కార్యకలాపాలు కొనసాగించాలని కోరారు.

దుర్మార్గంగా చర్చి బాధ్యతలు తీసుకున్నారు..



కోర్టు ఆర్డర్‌ కాపీని చూపిస్తున్న జే. మత్తయ్య

చిక్కడపల్లి: గోల్కొండ క్రాస్‌రోడ్డులోని ప్రసిద్ధి చెందిన హెబ్రోను చర్చిలో రాజకీయ కుట్రలతో హైకోర్టును ఆర్డర్‌ను దిక్కరించి అక్రమంగా పోలీసులు జులుంతో సొసైటీ సభ్యుల నుంచి ట్రస్ట్‌ సభ్యులు చర్చి నిర్వాహణ బాధ్యతలు స్వాధీనం చేసుకోవడం దుర్మార్గం అని క్రైస్తవ ధర్మప్రచారన పరక్షణ సమితి అధ్యక్షుడు జెరుషలేము మత్తయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో చర్చి ట్రస్ట్‌ సభ్యులు ఏపీ మాజీ ఉద్యోగి ఎఫ్‌సీఎస్‌ పీటర్‌, జాన్‌ సుబ్బారెడ్డి వర్గానికి మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు ప్రోద్బలంతో సొసైటీ సభ్యులను గాయపరి హెబ్రోను చర్చి నిర్వహణను ట్రస్ట్‌ సభ్యులు అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధికంగా ఉన్న దళిత క్రాస్తవులు, బీసీ క్రైస్తవులు మనోభావాలను పరిగణలోకి తీసుకోకుండా కాంగ్రెస్‌ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తెలంగాణలోని క్రైస్తవ మత సంస్థల అంతర్గత వ్యవహారంలో కాంగ్రెస్‌ తలదూర్చడం హెబ్రోను ట్రస్ట్‌కు కాంగ్రెస్‌ ప్రభుత్వం అర్ధరాత్రి మద్దతు తెలుపడాన్ని క్రైస్తవ సమాజం ఖండిస్తుందని తెలిపారు.

వర్ష బీభత్సం



చిక్కడపల్లి డివిజన్‌లో..



పద్మశాలికాలనీలో..



రాజా డిలక్స్‌ చౌరస్తాలో..

ముషీరాబాద్‌: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి భోలక్‌పూర్‌ డివిజన్‌లోని పద్మశాలికాలనీలో వరద ఏరుపై పారింది. డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లాయి. ఈ విషయాన్ని మాజీ కార్పొరేటర్‌ వాజీద్‌ హుస్సేన్‌ జీహెచ్‌ఎంసీ జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిశీలించారు. రాజా డిలక్స్‌ చౌరస్తా వద్ద వర్షపునీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి.

కూలిన చెట్లు... ధ్వంసమైన కార్లు

చిక్కడపల్లి: గాంధీనగర్‌ డివిజన్‌లోని అరుంధతి నగర్‌, బాపూనగర్‌, ఆంధ్రాకేఫ్‌, నర్మద ఆసుపత్రి లేన్‌లలో తదితర ప్రాంతాలలో భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ సందర్భంగా ఈ ప్రాంతాల్లో చెట్లు కూలి మూడు కార్లు ధ్వంసమయ్యాయి. బీజేపీ సికింద్రాబాద్‌ పార్లమెంట్‌ జాయింట్‌ కన్వీనర్‌ వినయ్‌కుమార్‌ లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. నెలకూలిన చెట్లను, కొమ్మలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ప్రజలు ఇబ్బందులు పడితే కార్పొరేటర్‌ పావని దృష్టికి తీసుకురావాలన్నారు. అదేవిధంగా కాంగ్రెస్‌ నాయకులు గుర్రం శంకర్‌, అభిషేక్‌ కెనడీలు పరిస్థితిని సమీక్షించారు.

వర్షానికి నేలకూలిన భారీ వృక్షం

కాచిగూడ: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్లపై ఉన్న చెట్లు నేలకూలుతున్నాయి. దీంతో ట్రాఫిక్‌ జామ్‌తో పాటు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదివారం కాచిగూడ, లింగంపల్లిలోని కర్ణాటక సాహిత్య మందిర్‌ వద్ద రోడ్డు పక్కన ఉన్న భారీ వృక్షం నేలపై కూలిపడింది. విద్యుత్‌ వైర్లు తెగిపడటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన కార్పొరేటర్‌ ఉమా రమేష్‌యాదవ్‌ సంఘటన స్థలానికి చేరుకుని అధికారులను పిలిపించి రోడ్డుపై పడిన చెట్ల కొమ్మలను తొలగించారు.



సాహిత్య మందిర్‌ వద్ద



కృపారావు బస్తీలో..

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

ముషీరాబాద్‌: అడిక్‌మెట్‌ డివిజన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యులు ఆర్‌.శేషసాయి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం అడిక్‌మెట్‌లో బీజేపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. బీజేపీ సభ్యత్వ నమోదు ఏ విధంగా చేయాలి.. నియమ నిబంధనలు, డివిజన్‌ స్థాయి టార్గెట్‌, బూత్‌ కమిటీలకు ఇచ్చే టార్గెట్‌లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోపాల్‌, అసెంబ్లీ కన్వీనర్‌ రమేష్‌రామ్‌, డివిజన్‌ అధ్యక్షుడు నరేష్‌, నాయకులు సాయికృష్ణయాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్‌ పనులు ప్రారంభం

ముషీరాబాద్‌: రాంనగర్‌ డివిజన్‌ శాస్త్రీనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌కు తన సొంత నిధులతో బోర్‌వెల్‌ను ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ వేయించారు. ఈ సందర్భంగా ఆదివారం బోర్‌వెల్‌ పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు ఆర్‌.మోజెస్‌, సమయ్య, జంగయ్య, రాము, దస్తగిరి, ఉపేందర్‌, రవి, నాయుడు, శ్యామ్‌ పాల్గొన్నారు.